# భంగపాటు

రాగిణి ఒంటరిగా కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆమె వేడి నిట్టూర్పులకు ఎదురుగావున్న దీపం అటూ ఇటూ ఊగిసలాడుతోంది. ఒక్కొక్క సమయంలో దీపం చాలా చిన్నదయి, చీకట్లో కలిసిపోతానని బెదరిస్తోంది. దీనికి తోడు బైటనుంచి గాలి అలలు అలలుగా వచ్చి, కలవర పెట్టేస్తోంది. కళ్ళార్పకుండా ఆమె, దీపం వైపే ఆవేశంగా క్షణంపాటు చూసింది. మరుక్షణంలో దీపం పెద్దదయి, నిలకడగా నిలబడుతోంది. తన అస్థిత్వాన్ని నిలబెట్టుకోవటానికి గాలితో పెనుగులాడుతోంది.

రాగిణి గజగజ వణికిపోతోంది. గుయ్‌మని మోత వినిపిస్తోంది. కీచురాళ్ళ ధ్వని మరీ వింతగా వినిపిస్తోంది. తన యింటిచుట్టూ కాపలాదార్లులాగ ఎత్తుగా నిలబడ్డ తాటితోపును తలుచుకుంటే ఒళ్లు జలదరించిపోతుంది. భయమేసి ఏడుపు మానేసింది ఓ క్షణం. తాటాకులు గలగలమని మోగుతున్నాయి, గుటకలువేస్తూ, చెదురుగా అటూ ఇటూ చూస్తోంది. కళ్ళు మూస్తూ, తెరుస్తూ, గుమ్మంవైపుకే వింతగా చూస్తోంది. ఎవరో వస్తున్నట్లు అలికిడి అయింది. శ్వాస గబగబ పీలుస్తూ, కళ్ళు నిలిపేసి, భయంగా ప్రాణాలు బిగపెట్టుకుని కూర్చుంది.

'అంబికా....!' అంటూ మెల్లిగా స్వరం వినిపించింది.

రాగిణికి. ప్రాణం లేచివచ్చినట్లనిపించింది.

తాతా !....అంటూ గబాలునలేచి ముందుకు అడుగు వేసింది. బిగ్గరగా ఏడవటం మొదలు పెట్టింది.

'మళ్ళీ ఏమయింది !....అమ్మేది ?....మళ్ళీ కొట్టిందా !....' దాసు ఆదుర్దాగా అడుగుతున్నాడు.

ఊఁ....ఊఁ....అంటూ ఏడుస్తూనే వుంది.

లేదులే అమ్మ లేదులే అంటూ ఓదారుస్తున్నాడు.

ఇద్దరూ బైటకువచ్చి నిలబడ్డారు. ఆకాశమంతా చుక్కలతో నిండివుంది. చుట్టూ చీకటి ఆవరించుకుని వుంది. గాలి రయ్‌మని వీస్తూ, తాటి చెట్లను కూడా ఊపేస్తోంది. చెట్ల మధ్యగా మిణుకు మిణుకు మంటూ దీపాలు కనిపిస్తున్నాయి. వాటిని చూస్తూ, అమ్మో అంటూ ఆయన్ను చుట్టేసింది.

'ఏమిటి ?....'

'అవిగో.... కొరివి దయ్యాలు !....' బెదిరి అనేసింది. పగలల్లా అక్కడా యిక్కడా తిరిగి, వాళ్ళు చెప్పిన కబుర్లు, వీళ్ళు చెప్పిన మాటలు మెదడులోకి తెచ్చుకుంటూ హడలి పోతోంది.

'అవి దయ్యాలు కావు....దీపాలు....అక్కడ ఎవరో అన్నం వండుకుంటున్నారు....' దాసు నవ్వుతూ అన్నాడు.

'అవి దయ్యాలే !....' బిక్క మొహం వేసుకుని, బెరుకుగా అంటోంది.

'నువ్వు ఒట్టి పిరికి పిల్లవు....'

ఆ చిక్కటి చీకట్లోంచి, ఓ దీపం ఊగిసలాడుతూ ముందుకు వస్తున్నట్లు కదులుతోంది.

'తాతా....తాతా....' అంటూ ఆయన చాటుకుచేరి ఆయాసపడి పోతోంది. దాసు తలెత్తి తీక్షణంగా చూసి, కొంచెం దూరంలో వుండగానే పోల్చుకున్నాడు.

'అదుగో....మీ అమ్మ వస్తోంది. లాంతరు పట్టుకుని....' రాగిణిని రెక్క పట్టుకుని ముందుకు లాగాడు.

ఊ....ఊ....ఊ....అంటూ మళ్ళీ సన్నగా ఏడవటం మొదలు పెట్టింది. 'ఎక్కడికెళ్లావు!....' దాసు ప్రశ్నించాడు.

'ఎక్కడికైనా వెళ్లాలసి వస్తుంది! దీంతో ఎంత చావుందనుకున్నావేమిటి! నాయనతోపాటు యిదికూడా పోయినా, పీడ విరగడయి పోయేది!....నామాట దక్కించేటట్లు కనబడటంలేదు....అసలు అప్పుడే ఆ ఆసుపత్రిలోనే వదిలేసి వచ్చినా ఏ పీడ వుండేదికాదు....' అంబిక అక్కసుగా అన్నది.

దాసు తనలో తాను నవ్వుకున్నాడు.

అంబిక గభాలున లోపలికి వెళ్ళి పోయింది.

'ఏంచేశావమ్మ చెప్పు నాతో, ఏడవక!....' దాసు, రాగిణిని బ్రతిమాలుతున్నాడు. రాగిణి ఏమి సమాధానం చెప్పటంలేదు.

'చెప్పు మరి! అమ్మెందుకు కొట్టింది!....'

'ఎప్పుడూ నేను దొంగతనం చెయ్యను తాతా !....' హడలి పోతూ అన్నది.

'ఇట్లా ఎన్నిసార్లు చెప్పింది, మళ్ళీ ఎన్నిసార్లు చేసింది....' లోపల్నుంచి చివాలున అంబిక వచ్చేసింది.

'నిన్ను చూసి భయపడి పోతోంది.'

'ఇప్పుడెందుకు భయం !....తప్పుడు పని చేసేటప్పుడు భయం ఉండాలిగాని....రావే లోపలికి....' కసురుకుంది.

'పో....వెళ్ళు....అన్నంతిను....నిజం చెప్పటం నేర్చుకోవాలి.... దొంగతనం చెయ్యటం ఎంత తప్పో, అబద్ధాలు చెప్పటంకూడా అంతే తప్పు !....' ఏదో కారణంగా దెబ్బలు తింటూనే వున్నావు !....పద.... లోపలికి పద....అమ్మ కొట్టదులే యింకా !....'

'అదంతా భయమే !....నేనంటే భయమున్నదయితే, మళ్ళీ ఎత్తుకొస్తుందీ !....'

'దాన్నేమనక యింకా, అసలే భయపడి పోతోంది....' దాసు మెల్లిగా చీకట్లను చీల్చుకుంటూ సాగిపోయాడు.

ఉలిక్కిపడుతూ, బెరుకు బెరుకుగా ఒక్కొక్క అడుగువేస్తూ, లోపలికివెళ్ళి కూర్చుంది.

అంబిక చివాలునలేచి ముందుకు వచ్చింది.

'అమ్మా !....ఆకలయిందే....అందుకని ఏమన్నా కొనుక్కుని తిందామని....' తత్తర బిత్తరగా మాటలు గుటకలువేస్తూ అన్నది రాగిణి.

'ఆకలయిందని' పరాయివాళ్లింట్లో డబ్బులేత్తుకొస్తారా!....కాస్త ఆగుతే నేను రాకపోయానా....' ఓ కంచం ముందర పడేసింది. యింత అన్నంపెట్టి.

రాగిణి శరీరం వణుకుతోంది. ఉక్కిరిబిక్కిరయి కూర్చుంది.

'తినవే! అల్లా చూస్తావు!....' కళ్లురిమింది అంబిక.

రాగిణి బిత్తరపోయి తల్లి మొహంలోకి చూస్తోంది.

'నిన్నే! అన్నంతిను! ఆకలి కావటం లేదా ఏమిటి?....' కూతురు చెయ్యి పట్టుకుంది. చప్పున తలెత్తి, రాగిణి మొహంలోకి చూసింది. నుదురుమీద చెయ్యి పెట్టింది. వెచ్చగా తగిలింది. గుండె గుభేలుమంది. గభాల్న ఒళ్లోకి తీసుకుంది. కాగిపోతోంది శరీరం.

అమ్మా దాహం, దాహం అంటూ పడుకుంది. తెగ ఆయాస పడి పోతోంది. అంబిక తత్తరలాడి పోతోంది. అంతా నిర్మానుష్యంగా వుంది. పిలుస్తే ఎవ్వరూ పలికేటట్టులేరు.

అమ్మాయి, అమ్మాయి అంటూ రెండుసార్లు పిలిచింది.

ఊ....ఊ....అంటూ మూలుగుతోంది.

ఆ రాత్రిపూట ఎక్కడికీ వెళ్లేటట్లు కనబడటంలేదు. అంతా దైవంమీద భారంవేసి గృహ వైద్యం ఏదో చేసింది.

తనకు నిజంగా కోపంవస్తే ఒళ్ళూపై తెలీదు. చిన్నపిల్ల తెలిసో, తెలికో చేసిన పనికి, తాను అంత పట్టుదలపట్టి, చావబాదింది. అసలు ఆ దెబ్బతోనే దడుచుకుని పోయింది. గుండెల్లో ఆధైర్యం ఏర్పడి పోయింది. జ్వరం వచ్చేసింది.

అంబికకు కంటిమీద కునుకు లేదు. ఏమిటా భగవంతుడా అని ప్రార్థిస్తూ కూర్చుంది.

తెల్లారిన తర్వాత కూడా, రాగిణి అట్లాగే మూలుగుతూ వుంది. దాసుదగ్గరకు వెళదామంటే మనస్కొప్పటంలేదు. తనను ఏమన్నా అంటాడేమోనని అభిమానంతోనే వుండిపోయింది. డాక్టరు వచ్చి చూసిపోయాడు. ఫీజు క్రింద మూడు రూపాయలు చెల్లించుకుంది. నోటు మారిస్తే, యింకా రెండు రూపాయలే మిగిలినాయి. మందు వ్రాసి యిచ్చాడు కొనుక్కొని రమ్మనమని. ఆదుర్దాగా బజారు వెళ్ళి కనుక్కుంటే, నాలుగున్నర చెప్పాడు. అలాంటివి మూడు యివ్వాలిట కూడాను. అంబిక కంగారు పడిపోయింది. ఎట్లాగు అవి గాభరా పడిపోతోంది.

మామూలు మందులకయితే ఈ జ్వరం లొంగదు. ఆ క్యాప్సుల్స్ వాడాల్సిందే అని డాక్టరు ఖచ్చితంగా చెప్పి మరీ వెళ్ళాడు.

పిచ్చి ఎత్తిన దానిలాగా అటూ ఇటూ తిరుగుతోంది. మూడు మూన్నాళ్ళకు వచ్చి యోగక్షేమాలు కనుక్కొని వెళ్ళే దాసు కూడా యీ మధ్య యీ చాయలకే రావటంలేదు. అంతా అయోమయంగా వుంది.

దీపాలు పెట్టేశారు. రాగిణిని మెల్లిగా లేవదీసి, కూర్చో పెట్టింది. వెర్రిగా ఆలోచిస్తోంది. ఆసుపత్రికే తీసుకు వెళ్ళి, డాక్టరుకే అప్పచెప్పేసి ఆయన కాళ్ల మీద పడి ప్రార్థిద్దామనుకుంది. వాకిట్లో రిక్షాను ఆపి, తాను కూర్చుని కూతుర్ని ఒళ్ళో కూర్చో పెట్టుకుంది. గబగబ ఆసుపత్రి వైపుకు వెళ్లుతున్నారు.

తీరా అక్కడికి వెళ్ళేటప్పటికి, డాక్టరుగారు లేడు. కూతుర్ని

బల్లమీద పడుకో పెట్టింది. చైతన్య రహితంగా క్షణకాలం నిలబడి పోయింది.

'ఆయనిప్పుడు రాడు. అయినా ఆయన రావటం ఎందుకు! మొన్న రాసి యిచ్చిన మందు వాడావా' అని నర్సు అడుగుతూనే యింకో గదిలోకి వెళ్లి పోయింది.

అంబిక మొద్దుబారి పోయింది. కూతురు వైపుకు ఆవేదనగా చూసింది. రొప్పుతోంది. తెగ బాధపడుతున్నట్లు కనిపిస్తోంది. తన కడుపు తరుక్కు పోతోంది. కూతురు ఏమవుతుందో అని హడలి పోతోంది.

అటూ ఇటూ చూసింది. వింత ఆలోచన క్షణంలో బుర్రలోకి వచ్చి దూరింది. బాగా ఆయాసపడి పోతోంది గుటకలు వేస్తూ. నిశ్శబ్దంగా డ్రాయరు దగ్గరకు వచ్చి, తలుపు మెల్లిగా తెరిచింది. చిల్లర అక్కడా ఇక్కడా విరజిమ్మి వుంది. కాస్త మూలగా కొత్త నోట్లు కళ్లు జిగేలు మన్నట్లు కనపడ్డాయి.

గుండె ఝల్లు మంది. మళ్ళీ అటూ ఇటూ బిత్తరుపోతూ చూసింది. చప్పున చేతిని డ్రాయరులోకి పోనిచ్చి, గుప్పెటితో చిక్కిన నోట్లను తీసుకుని, గభాలున చీరె కొంగులో చుట్టేసుకుంది.

ఒళ్లు జలజలలాడి పోతోంది. ముచ్చెమట్లు పోసినాయి. కళ్లు గిర్రున తిరిగినాయి. చేతులూ కాళ్లూ వణికి పోతున్నాయి. ఒక్క క్షణంకూడా నిటారుగా నిలబడలేక పోతోంది. టేబుల్ ఆసరాతో మెల్లిగా వచ్చి కూతురు దగ్గర నిలబడింది.

రాగిణి రెండు కళ్లూ నిలిపేసి తల్లి మోహంలోకి వింతగా

చూసింది. అంబిక గుండె గుభేలుమంది. హృదయ చలనం ఆగిపోయి నట్లనిపించింది. కొయ్యబారిపోయి నిలబడి పోయింది.

రాగిణి పెదిమలు కదిలిస్తూ ఏదో చెప్పటానికి ప్రయత్నం చేస్తున్నట్లు కనబడుతోంది. తల్లిని చూసి పేలవంగా పల్లు బైట పెట్టింది.

'అమ్మా!....నా మందుకేనా!....తీసుకురా....తాతతో చెప్పన్లే....' రాగిణి అమాంతం తల్లిని చుట్టేసుకుంది.

(యువ, డిసెంబర్ 1961)